సాక్షి
నిర్మల్

ఆదివారం । 19 । మార్చి । 2023



కీచక గురువు..!

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డులో గల ఓ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ గురువు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. 8లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల ఇచ్చోడ మండలం దేవుల్‌నాయక్ తండా సమీపంలో డ్రైవర్‌ను కత్తితో పొడిచి కంటైనర్, అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /19.6

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మున్సిపల్ సిబ్బందికి మెమో

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో పన్నుల వసూళ్లలో జాప్యం కారణంగా రీజనల్ డైరెక్టర్ వరంగల్‌తోపాటు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఖానాపూర్‌కు చెందిన ముగ్గురు సిబ్బందికి మెమోలను జారీ చేశామని కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. పన్నులు వసూలు చేసే అధికారులు, సిబ్బంది ఈ నెల 31వ తేదీలోగా 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈమేరకు మున్సిపల్ సిబ్బంది రాజు, వెంకన్న, భోజారాంకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

స్వచ్ఛత-2023 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత – 2023 అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, పర్యావరణ ఇంజినీర్ చేతన్ తెలిపారు. వ్యర్థాల శుద్ధికరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి, పొడి చెత్తద్వారా సేంద్రియ ఎరువుల తయారీ విభాగాల్లో కృషిచేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులని వివరించారు. ఈనెల 23లోగా స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు.

జిల్లాకు చేరుకున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు

ఖానాపూర్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షల మొదటి సెట్ ప్రశ్నపత్రాలు శనివారం జిల్లాకు చేరుకున్నాయి. ఖానాపూర్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలను ఎంఈవో మధుసూదన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సై శంకర్ సమక్షంలో నిబంధనల మేరకు భద్రపరిచారు. ఖానాపూర్ పట్టణంలోని మూడు కేంద్రాల్లో 722 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని రూట్ అధికారి మధుసూదన్, అసిస్టెంట్ రూట్ అధికారి పరమేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల డీవోలు, సీఎస్‌లు నాగేష్‌బాబు, రవిబాబు, సుదర్శన్, మమత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకూ వేసవి సెలవులు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఇస్తున్నట్లుగా అంగన్‌వాడీ కేంద్రాలకూ ఒంటిపూట బడి, వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ.రాజమణి అన్నారు. ఈమేరకు డీడబ్ల్యూవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత కారణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023, మార్చి 15 నుంచి ఒకపూట బడిని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తుందన్నారు. ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకా చిన్నపిల్లలు ఉన్నందున ఒంటిపూట నడపాలని, మే నెలలో సెలవులు ఇవ్వాలని కోరారు. గర్భిణులు, బాలింతలు ఎండలో సెంటర్‌కు రావడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మన సురేశ్ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, జిల్లా ఉపాధ్యక్షులు శశికళ, శైలజ, గంగామణి, విజయ, స్వర్ణ లత, భాగ్యలక్ష్మి, దేవి రమ్య, లావణ్య, గంగవ్వ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌ను పరిశీలించిన డీఈ



విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న డీఈ

ముధోల్: మండలంలోని వితోలి గ్రామంలో విద్యుత్ లైన్‌ను నిర్మల్ సర్కిల్ డీఈ రత్నకుమారి శనివారం పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాన్ని తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. డీఈ వెంట కమర్షియల్ ఏఈ మధుకర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.



బోనమెత్తిన పీచర 8లో▸

ఏప్రిల్ నుంచి ఎలమంద!



- రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఆగస్టు నెలాఖరు వరకు పూర్తికానున్న ప్రక్రియ
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- జిల్లాలో 7,274 మంది లబ్ధిదారులు

నిర్మల్‌చైన్‌గేట్: గొల్లకురుమలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. 75 శాతం రాయితీపై రెండు విడతలుగా లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. మొదటి విడత పంపిణీ పూర్తయింది. తాజాగా రెండో విడత జీవాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఏప్రిల్ నుంచి గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు వరకు ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తొలి విడతలో..

గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు జిల్లాలో 2017 మే, జూన్ నెలల్లో ఒకేసారి మొదటి, రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడత లక్ష్యం 7,148 కాగా, ఇప్పటి వరకు 6,779 యూనిట్ల పంపిణీ చేశారు. ఇంకా 369 యూనిట్ల పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గొర్రెల పంపిణీలో భాగంగా ఒక్కో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా, లబ్ధిదారుల వాటా రూ.31,250 మిగిలిన రూ.93,750 సబ్సిడీ కింద ప్రభుత్వం చెల్లిస్తుంది.

రెండో విడత...

రెండో విడత లక్ష్యం 7,274 యూనిట్లు కాగా, వీటిలో గతంలో కేవలం 141 యూనిట్లు మాత్రమే పంపిణీ చేసి నిలిపివేశారు. దీంతో రెండో విడతకు ఎంపికైన 7,274 మంది లబ్ధిదారులు ఐదేళ్లుగా గొర్రెల యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 9న నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రెండో విడతలో అర్హులైన వారందరికీ ఏప్రిల్ మొదటి వారం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

రాయితీ పెంపు...

రెండో విడతలో గొర్రెల యూనిట్ల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వం యూనిట్ విలువతోపాటు రాయితీని పెంచింది. యూనిట్ విలువ రూ.1,75,000 కాగా, లబ్ధిదారుడి వాటా 25 శాతం రూ.43,750 డీడీ తీసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మిగతా రూ.1,31,250 సొమ్మును ప్రభుత్వమే భరిస్తుంది. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించి ఆగస్టు వరకు పూర్తి చేసేందుకు యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తికాని మొదటి విడత లక్ష్యం..

గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రభుత్వం 75 శాతం రాయితీతో గొర్రెలను పంపిణీ చేస్తోంది. 25 శాతాన్ని లబ్ధిదారులు చెల్లించాలి. ఇలా చేస్తే 20 గొర్రెలతోపాటు ఒక పొట్టేలు అందిస్తారు. జిల్లాలో మొదటి విడతలో భాగంగా 369 మంది డీడీలు చెల్లించి గొర్రెల పంపిణీకి ఎదురు చూస్తున్నారు. గొర్రెల పంపిణీలో మొదటి విడత లక్ష్యం పూర్తికాకపోవడంతో 2వ విడతలో లబ్ధిదారులెవరూ డీడీలు చెల్లించలేదు. రెండో విడతకు ఎంపికైన లబ్ధిదారులు రూ. 43,750 డీడీ తీసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం...

రెండో విడత రాయితీ గొర్రెల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. జిల్లాలో 2వ విడతలో 7,274 యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వీటిలో 141 యూనిట్లు పంపిణీ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మిగతావారికి పంపిణీ చేస్తాం.

– శంకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

'ఉత్తి'పోతలే!



అష్టా ఎత్తిపోతల పథకం

- తలాపునే గోదారి.. అయినా ఆ చేల్లు ఎడారే..
- 13 ఏళ్లుగా వృథాగా ఉంటున్న అష్టా లిఫ్ట్
- చుక్కనీరు ఎత్తిపోయని రూ.10 కోట్ల పథకం

ముధోల్: బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో 2007లో అప్పటి ప్రభుత్వం ముధోల్ మండలం అష్టా గ్రామం వద్ద గోదావరి తీరాన రూ.10 కోట్ల నాబార్డు నిధులతో ఐడీసీ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. 2009లో పనులు పూర్తయ్యాయి. 2010లో ఆయకట్టుకు నీరందించేందుకు మూడు కిలోమీటర్ల వరకు పైపులైన్ నిర్మించారు. ఊరు సమీపంలోని మామిడికుంట చెరువుతోపాటు, పొలాలకు నీళ్లు వదిలారు. ఒక్కసారి వదిలిన నీటికే పైపులన్నీ లీకేజీ అయ్యాయి. తర్వాత మరమ్మతులు చేసి ఒకసారి మామిడి కుంట చెరువు నింపారు. మళ్లీ పైపులు లీక్ కావడం, మరమ్మతులకు నిధులు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. తర్వాత దానిని పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో పైపులైన్లు, కుండీలు కూడా ధ్వంసమయ్యాయి.

1,500 ఎకరాల ఆయకట్టు..

అష్టా ఎత్తిపోతల పథకం ద్వారా 1,500 ఎకరాలకు సాగునీరందిచాలని నిర్ణయించారు. కానీ, రూ.10 కోట్ల నిర్మాణంతో చేపట్టిన లిఫ్ట్ ఒక్కసారి మినహా నీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. దీంతో అష్టా గ్రామంతోపాటు బ్రహ్మన్‌గావ్ గ్రామాల పక్కనుంచే గోదావరి పారుతున్నా.. ఆయా గ్రామాల్లోని 1,500 ఎకరాలకు నీరందడం లేదు. ఎత్తిపోతల పథకం నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో 13 ఏళ్లుగా చుక్క నీరు కూడా ఎత్తిపోయడం లేదు. దీంతో రైతులు తిరిగి బోర్లు, బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు.

రూ.10 కోట్లు గోదావరిపాలు..

1,500 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో రూ.10 కోట్లతో నిర్మించిన అష్టా ఎత్తిపోతల పథకం 13 ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంటోంది. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన 3 మోటార్లు వాడకం లేక పోవడంతో తుప్పుపట్టి పాత సామగ్రి కింద అమ్మేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పనికిరాకుండా పోయాయి. ఎత్తిపోతల పథకం సామగ్రి చాలా వరకు చోరీ అయింది. మొత్తంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో రూ.10 కోట్లు గోదావరిలో పోసినట్లయింది.



తుప్పు పట్టిన ఎత్తిపోతల పథకం సామగ్రి

పథకం అందుబాటులోనికి తీసుకరావాలి



అష్టా గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తే ఎంతో మంది రైతులకు ఉపయోగపడుతుంది. వందల ఎకరాలకు సాగునీరందుతుంది. రెండు పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది.

– పోశెట్టి (రైతు)

ఏళ్లుగా వృథా..



పథకం చెడిపోయి ఏళ్లు గడుస్తోంది. మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. పలు మార్లు అధికారులు సందర్శించారు. కానీ మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి అష్టా లిఫ్టుకు మరమ్మతులు చేపట్టాలి.

– మోహన్‌రెడ్డి, నీటి సంఘం చైర్మన్

మరమ్మతులు చేయిస్తాం

అష్టా ఎత్తిపోతల పథకానికి త్వరలో మరమ్మతులు చేయిస్తాం. ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తాం. ధ్వంసమైన పైపులు, చెడిపోయిన కుండీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. త్వరలో గ్రామాన్ని సందర్శించి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తా.

– సముద్రాల వేణుగోపాలాచారి, ఐడీసీ చైర్మన్

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలని డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. ఇటీవల పూర్తయిన పదో తరగతి హిందీ సబ్జెక్టు ప్రీ ఫైనల్ ఫలితాలపై సంబంధిత ఉపాధ్యాయులతో జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శనివారం రివ్యూ నిర్వహించారు. విద్యార్థులు అన్నీ పేపర్లలో 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో పరీక్షలకు సంబంధించిన భయాన్ని తొలగించాలని తెలిపారు. హిందీ పరీక్షను ఏ విధంగా రాయాలో వివరించాలన్నారు . సి గ్రేడ్ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 6,124 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్నారని, వీరంతా పాస్ కవాలని స్పష్టం చేశారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారి నరసయ్య, ఎంఈవో కస్తూరి శంకర్, ధర్మాజీ చందనే, సురేశ్ జోషి, వసియొద్దీన్, ధీరజ్ కులకర్ణి, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలు పెంపొందించాలి..

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించేలా సీఆర్పీలు కృషి చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో రూమ్ టు రీడ్ వారి అధ్వర్యంలో సీఆర్పీలు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. సంస్థ ద్వారా ప్రతీ కాంప్లెక్స్‌కు ఆరు రకాల పుస్తకాలు వెయ్యి చొప్పున అందిస్తారన్నారు. ఈ పుస్తకాలు విద్యార్థుల్లో చదవడం, రాయడం, అవగాహన చేసుకోవడం, ఊహించడం, వ్యాకరణం వంటి అనేక భాషా నైపుణ్యాలు పెంపొందిస్తాయన్నారు. రూమ్ టు రీడ్ ప్రతినిధులు వీటిలోని కొన్ని సందర్భాలు, గేయాలు, నత్యాలు ప్రదర్శించారు. ఈ పుస్తకాలు గ్రీన్, రెడ్, యెల్లో, బ్లూ, ఆరంజ్, బ్లాక్ వంటి మొత్తం 6 రంగులుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ ప్రతినిధులు అజిత్‌రాజ్, తేజస్వి, గీత, క్వాలిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్ రెడ్డి

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

నిర్మల్‌చైన్‌గేట్: రెవెన్యూ శాఖలో పలువురు తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురు తాసీల్దార్లతో పాటు 13 మంది నయాబ్ తహసీల్దార్లకు స్థాన చలనం కల్పించారు. ఆర్డీవో బి.స్రవంతికి డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మైనారిటీ వెల్ఫేర్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న తుకారాంను ముధోల్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం.
కె.శివప్రసాద్	ఏవో కలెక్టరేట్	డీఏవో ఆర్డీవో నిర్మల్
కె.శ్యామ్‌సుందర్	ముధోల్	ఏవో కలెక్టరేట్
జి.తుకారం	డీఏవో ఆర్డీవో,	ముధోల్
జి.వెంకటరమణ	నిర్మల్ కలెక్టరేట్	ఆర్డీవో నిర్మల్
కె.సూర్దస్	ఆర్డీవో నిర్మల్	ఆర్డీవో భైంసా
ఎస్.గంగాధర్	ఆర్డీవో	భైంసా కలెక్టరేట్ నిర్మల్
నాయబ్ తహసిల్దార్	**ప్రస్తుత స్థానం**	**బదిలీ స్థానం**
మేంగ ప్రవీణ్	ఆర్డీవో, నిర్మల్	డీఎస్‌వో నిర్మల్
రవీందర్‌రెడ్డి	డీఎం సివిల్‌సప్లై నిర్మల్,	తానూర్
ఎం.లచ్చిరాం	తానూర్	డీఎం సివిల్‌సప్లై నిర్మల్
జి.రమేశ్	డిస్టిక్ సివిల్ సప్లై	ఆర్డీవో నిర్మల్
ఎస్.సంతోష్	సారంగాపూర్	మామడ
కె.రవీందర్	ముధోల్,	సారంగాపూర్
ఎండీ.ఫారూఖ్	ఖానాపూర్	ఎలక్షన్ విభాగం కలెక్టరేట్
ఆర్.అశోక్‌కుమార్	లోకేశ్వరం	ఖానాపూర్
కె.ముత్యం	నర్సాపూర్(జి),	ముధోల్(ఎపిక్)
ఎండీ.షబీర్	కలెక్టరేట్	లోకేశ్వరం
ఎం.బాబురావు	ఎస్డీడీ(ఎల్ఏ) యూనిట్ 1 నిర్మల్	డీఎం సివిల్‌సప్లై ఎంఎల్ఎస్ పాయింట్
జె.రోహిదాస్	సోన్	నిర్మల్
ఎండీ.అతీఫ్	మామడ, ఎస్డీడీ(ఎల్ ఏ)యూనిట్ 1	నిర్మల్

ఇంటర్ పరీక్షకు 396 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షకు 396 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 6,827 మంది విద్యార్థులకు 6.431 మంది హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 5,878 మంది విద్యార్థులకు 5,629 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 949 మంది విద్యార్థులకు 802 మంది హాజరయ్యారని డీఐఈవో పరశురాం తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం..



కుంటాలలో కురుస్తున్న వర్షం

కుంటాల/కడెం: జిల్లాలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కుంటాల మండలంలోని ఓలా, సూర్యాపూర్, కుంటాల, అంబకంటి, వెంకూర్ గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. కడెం మండలంలో ఈదురు గాలులతో వడగండ్ల వాన కురిసింది. కల్లెడ, నవాబ్‌పేట్ తదితర గ్రామాల్లో రాళ్లు పడ్డాయి. ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. భైంసా పట్టణంలో రాత్రి 8 గంటల సమయంలో వర్షం కురిసింది.



కడెంలో కురిసిన వడగళ్లు

కోరం లేక ఖానాపూర్ మున్సిపల్ సమావేశం వాయిదా

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన బడ్జెట్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశం నిర్వహణకు అవసరమైన సభ్యులు రాకపోవడంతో సమావేశం వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన కాంగ్రెస్, బీజేపీ..

మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు బహిష్కరించారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం మాట్లాడుతూ గత మూడేళ్లుగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ వాటి ఖర్చు వివరాలు కనీసం కౌన్సిలర్లకు కూడా తెలియజేయడం లేదన్నారు. మున్సిపల్‌కు వచ్చే ఆదాయ వివరాలు సైతం మున్సిపల్ చైర్మన్, కమిషనర్ గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపించారు. పట్టణంలో కోతులు, కుక్కలతో ప్రజలు భయపడుతున్నారన్నారు. వాటిని నిర్మూలించడంలో చైర్మన్, కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పట్టణంలో సమస్యలు పరిష్కరించకపోగా, జమ, ఖర్చుల వివరాలు తెలియజేయకపోవడాన్ని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ వార్షిక బడ్జెట్ రూ.80.24 కోట్లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీ 2023–24 వార్షిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను రూ.80.24 కోట్లుగా ప్రతిపాదించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని 42 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు తదితర అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈమేరకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.80.24 లక్షల అంచనాతో బడ్జెట్ రూపొందించామన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ నిర్వహణ, నీటి సరఫరా తదితర ఖర్చులు పెరిగినందున ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు. అనంతరం నూతన మున్సిపల్ భవనాన్ని మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కలెక్టర పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, పక్కన కలెక్టర్

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

భైంసాటౌన్: పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మేత్రి ప్రవీణ్ అన్నారు. మెప్మా కార్యాలయంలో మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై ఆర్పీలకు శనివారం అవగాహనతోపాటు పోషణ, ఆరోగ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పట్టణవాసులు చెత్తను బుట్టల్లోనే వేసి పారిశుధ్య కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించాలన్నారు. టీఎంసీ దత్తాత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇచ్చే రుణాల నుంచి కొంత మొత్తం వాస్ రుణాలు ఇవ్వాలని సూచించారు. సీవోలు వెంకటేశ్, ముజమ్మిల్ ఉన్నారు.

క్లుప్తంగా

కుక్కల స్వైర విహారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో శనివారం ఏఎస్సై లక్ష్మణ్‌తోపాటు సుమారు 20 మందిని పిచ్చికుక్కలు కాటు వేయగా గాయపడ్డారు. మండలకేంద్రానికి చెందిన గాయక్‌వాడ్ నిర్గుణ, గౌతమి, లక్ష్మి, విక్రమ్, రాంజన్‌షేక్‌తో పాటు హాథ్ సే హాథ్ జోడోయాత్రలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి మండలకేంద్రానికి వచ్చిన వీరారెడ్డి, వినోద్, రామేశ్వర్, పరశురాం తోపాటు 20 మందిపైగా పిచ్చి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్ రాగా అదుపుతప్పిన ట్రాక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్ రాగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి కారణమైంది. వివరాలు... మున్సిపాల్టీలో డ్రైవర్‌గా పని చేస్తున్న సాయన్న శనివారం విధులు ముగించుకొని కార్యాలయానికి ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. పట్టణంలోని శ్రీకష్ణ రెసిడెన్సీ సమీపానికి రాగానే అతడికి ఫిట్స్ రాగా కిందపడిపోయాడు. దీంతో అదుపు తప్పిన ట్రాక్టర్ పార్కింగ్ చేసిన వాహనాలపైకి దూసుకువెళ్లింది. దీంతో పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అక్కడే ఉన్న వ్యాన్‌లోకి ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న 14మంది ప్రయాణికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి డ్రైవర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాలు పైనుంచి ట్రాక్టర్ వెళ్లగా కాలు విరిగింది. వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.







రిమ్స్ చుట్టూ తేనెతుట్టెలు

ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రి చుట్టూ తేనేతుట్టెలు విచ్చలవిడిగా ఉన్నాయి. ప్రధానంగా ఎక్కువగా జనాలు తిరిగే ఆపరేషన్ థియేటర్ రూమ్ పక్కన అధికంగా ఉన్నాయి. అటు పక్కనే రోగుల బంధువులు, ఆస్పత్రికి వచ్చిన వారి కుటుంబ సభ్యులు సేదతీరుతుంటారు. వీటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. అనుకోని ఘటన జరిగితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఇకనైనా ఆస్పత్రి అధికారులు గమనించి వాటిని తొలగించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆగని విద్యార్థినుల అస్వస్థత

- ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- మెనూ పాటించడంలేదని ఆరోపణ
- ఘటనపై కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆరా
- గురుకులాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో
- వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన



ప్రిన్సిపాల్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో, ఆర్‌సీవో

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల (ఈఎంఆర్ఎస్) పాఠశాలలో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఎనిమిది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా, మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ సీహెచ్‌సీకి తరలించిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఆరోతరగతికి చెందిన విద్యార్థిని చౌహాన్ అంక్షిక, ఎనిమిదో తరగతి విద్యార్థిని సుగుణాదేవి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ఆక్సిజన్ అందించారు. పాఠశాలలో 349 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 279 మంది బాలురు, 70 మంది బాలికలున్నారు. విద్యార్థినులు మాత్రమే శ్వాస సమస్యతో అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్ కొత్తగూడెం, వరంగల్ తదితర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ప్రతీరోజు ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థినులు శ్వాస సమస్యతో బాధపడుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటివరకు పాఠశాలను హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు మాత్రమే సందర్శించి ప్రథమ చికిత్స అందిస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థినులు ఇబ్బంది పడడానికి గల కారణాలపై ఆరా తీయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాఠశాలకు చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంతోనే అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. ఆర్నెళ్లుగా గుడ్లు, పల్లిపట్టీలు ఇవ్వడం లేదని తెలిపారు. నీళ్ల పప్పు, ప్రతీరోజు ఉదయం కిచిడి మాత్రమే పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా వార్డెన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ ఉపేందర్‌ను నిలదీశారు. జీసీసీ, కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయకుంటే ఉన్నతాధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌సీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆస్పత్రికి విద్యార్థినిని తీసుకువచ్చిన పాఠశాల సిబ్బంది

వైద్యశిబిరం ఏర్పాటు చేస్తాం

పాఠశాలలో చాలామంది విద్యార్థుల్లో రక్తహీనత, క్యాల్షియం, న్యూట్రీషన్ తక్కువగా ఉంది. విద్యార్థులు బలహీనంగా ఉన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పు కూడా తోడవడంతో విద్యార్థినుల్లో శ్వాస సమస్య వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో వారంపాటు ప్రత్యేక వైద్యనిపుణులతో వైద్య శిబిరాన్ని ఏ ర్పాటు చేస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటాం. స్థానిక ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత లేకుండా చూస్తాం. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో

కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆరా

మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల పరిస్థితి, విద్యార్థినుల ఆరోగ్యంపై కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఘటనపై నివేదిక అందించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఆర్‌సీవో గంగాధర్‌ను ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన అధికారులు విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు కారణాలు పరిశీలించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ప్రతీరోజు ఉదయం కిచిడి మాత్రమే పెడుతున్నారని, ఉదయం స్నాక్స్ ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పచ్చని చెట్లు నేలమట్టం..!



కూల్చివేసిన చెట్టు

భైంసాటౌన్: జిల్లాలో బోధన్–భైంసా 161 బీబీ రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భైంసా నుంచి బాసర వరకు పనులు చేపడుతున్నారు. కాగా, రహదారి విస్తరణ పనులతో పచ్చని చెట్లు నేలమట్టమవుతున్నాయి. భైంసా–బాసర మార్గంలో రోడ్డుకిరువైపులా పెరిగిన వృక్షాలను తొలగిస్తున్నారు. వీటి తొలగింపునకుగాను గుత్తేదారు నుంచి ఒక్కో చెట్టుకు రూ.550 చలానా వసూలు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. తొలగించిన చెట్ల స్థానంలో రహదారి పనులు పూర్తయిన అనంతరం మొక్కలు నాటాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేనిపక్షంలో చెల్లించిన మొత్తం రీయింబర్స్ కాదని పేర్కొన్నారు. కాగా, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన చెట్లు తొలగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బోనమెత్తిన పీచర



బోనాలతో వస్తున్న మహిళలు

లక్ష్మణచాంద: పీచర గ్రామంలో మహిళలు పోచమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇటీవల నూతన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. శనివారం ఉదయం పోచమ్మకు, సాయంత్రం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. సర్పంచ్ లత, ఎంపీటీసీ రాజేశ్వర్, ఉప సర్పంచ్ ముత్తన్న ఉన్నారు.

సంప్రదాయాలు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఇంద్రవెల్లి: సంస్కృతీసంప్రదాయాలను కాపాడుతూనే భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఆదివాసీలందరిపై ఉందని మాజీ ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేస్లాపూర్ గ్రామపంచాయతీ పరిధి కేస్లాగూడ గ్రామంలో హెరేకుమ్ర వంశానికి చెందినవారు కొత్తగా నిర్మించిన పెర్సపేన్ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాన్ని ప్రారంభించారు. అతిథులను హెరేకుమ్ర వంశీ యులు శాలువాలతో సన్మానించారు. అనంతరం నగేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడానికి, ఆలయాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, నాయకులు కనక తుకారాం, కనక హనుమంత్‌రావ్, కోరెంగా సుంగు, ఆదివాసీ పెద్దలు రామారావ్, యశ్వంత్‌రావ్, సుంకట్‌రావ్, వినాయక్‌రావ్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

సారంగాపూర్: పెండల్‌ధరి గ్రామానికి చెందిన తొడసం వాసుదేవ్ (27) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసుదేవ్ మూడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడున్నాడు. శనివారం తన పంటపొలానికి వెళ్లగా అక్కడ కనిపించిన పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన కుటుంబీకులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని బీసీ బాలురు వసతిగృహంలో ఓ ఇంటర్ విద్యార్థి శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. ముథోల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి భైంసాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో డబ్బుల విషయమై తండ్రి మందలించినట్లు తెలిసింది. మనస్తాపం చెంది హాస్టల్ పైకి వెళ్లి పురుగుల మందు (గుళికలు) తిని ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. తోటి విద్యార్థులు గమనించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి దుర్మరణం

తానూరు: ఈతకు వెళ్లి బావిలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ జీయా (30) రెండు రోజుల క్రితం తానూరులోని అత్తగారి ఇంటికి వచ్చాడు. శనివారం స్థానికులతో కలిసి ధర్మాబాద్ రోడ్డులో ఉన్న వ్యవసాయ బావికి ఈత నేర్చుకోవడానికి వెళ్లాడు. ట్యూబ్ సాయంతో ఈత కొడుతుండగా అది జారిపోయి బావిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పాంఢ్రకొడ తాలుకా చిన్నార్లిలో నివాసముంటున్న అడెల్లు (40) ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడు కొద్దిరోజులుగా తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయడం లేదు. మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ఆలూర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అవర్గ గ్రామానికి చెందిన ఎర్రోజు శ్రావణ్‌కుమార్ (31) మృతి చెందాడు. శ్రావణ్‌కుమార్ ఆర్మూర్‌లో పనులు ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా బైపాస్ మూలమలుపు వద్ద గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

కీచక గురువు

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- సస్పెండ్ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో కోచ్ రవీందర్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. కొద్దిరోజులుగా వేధింపులు, వెకిలి చేష్టలకు పాల్పడుతుండగా తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఈ విషయాన్ని శుక్రవారం తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో ఆమె శనివారం సంబంధిత హెచ్‌ఎం, ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ నలుగురు అధికారులతో విచారణ చేపట్టి ఉన్నతాధికారికి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా కీచక గురువు రవీందర్‌పై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఆటలు ఆడించే ఆ గురువు వాట్సాప్‌లో 'నువ్వంటే ఇష్టం.. ఎందుకు నన్ను పట్టించుకోవడం లేదు' అనే రీతిలో తనకు పెట్టిన మెస్సేజ్‌ను బాధిత విద్యార్థిని అధికారులకు చూపించినట్లు తెలిసింది. క్రీడల్లో విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన ఆ కీచక గురువు గతంలోనూ కొందరు విద్యార్థినులతో ఇలాగే ప్రవర్తిస్తుండేవాడని పాఠశాల విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా విద్యార్థినులతో ఇంటి పనులు చేయించుకోవడం, తన పిల్లల్ని ఆడించడం లాంటి పనులు చెప్పేవాడని తెలిపారు. తమ భవిష్యత్ ఇబ్బందుల్లో పడుతుందన్న భయంతో ఇప్పటివరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని బాధిత విద్యార్థినులు ఆవేదన వ్యక్తంజేశారు.

కీచక గురువుకే అధికారుల వత్తాసు..!

స్పోర్ట్స్ స్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన రవీందర్ కొన్నేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఆ పాఠశాల ఉన్నతాధికారి అండదండలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. విద్యార్థినులతో ఇంటి పనులు చేయించుకుంటున్నప్పటికీ ఉన్నతాధికారి పట్టించుకోకపోవడం.. ఆయనకే ఇతర పాఠశాలకు సంబంధించి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పలుసార్లు విద్యార్థినులు ఫిర్యాదు చేసినా అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జరిగిన ఘటనపై ఆ అధికారిని ఫోన్‌లో వివరణ కోరగా.. 'మా పాఠశాలలో అలాంటివేమీ జరగలేదు. మీకు ఎవరో తప్పుడు సమాచారం ఇస్తున్నారు' అని బదులిచ్చారు. ఆ తర్వాత 'కొద్దిసేపటి క్రితమే ఈ విషయం ప్రిన్సిపాల్ నా దృష్టికి తీసుకువచ్చారు. విచారణ జరిపించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా' అని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, కేర్ టేకర్ తన దృష్టికి తీసుకురాగా, ఇద్దరు విద్యార్థినులను పిలిచి జరిగిన ఘటన గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. నలుగురితో విచారణ జరిపించి ఉన్నతాధికారికి నివేదిక ఇస్తానని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ కోచ్ రవీందర్ సస్పెన్షన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాలలో అథ్లెటిక్స్ కోచ్‌గా వ్యవహరిస్తున్న రవీందర్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రవీందర్ ఆ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను లైంగికంగా వేధిస్తుండగా బాధితులు శనివారం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డీవైఎస్వో దృష్టికి తీసుకెళ్లగా, నలుగురు కమిటీ సభ్యులతో విచారణ చేపట్టారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందించారు. ఈ మేరకు కలెక్టర్ కోచ్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీవైఎస్‌వో) 'సాక్షి'కి తెలిపారు.



కంపుకొడుతున్న 'కంచెరోని'

నిర్మల్ నడి బొడ్డునున్న కంచెరోని చెరువు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపు కొడుతోంది. ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు, స్థానికులు దుర్గంధం భరించలేకపోతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్